క్లుప్తంగా

బొడ్రాయి ఉత్సవాలకు ఆహ్వానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని దౌలాపూర్ గ్రామంలో ఈనెల 18వ తేదీ నుంచి బొడ్రాయి, గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంగళవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికలను ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కృష్ణ అందజేశారు.

బీజేవైఎం జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా కరుణాకర్


కరుణాకర్

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేవైఎం జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన మొగుళ్ల పెద్ద కురుమ కరుణాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వినోద్‌కుమార్ సతీమణి ఎన్నికల ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం, లక్ష్మీపూర్, వడ్లూరు గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో వినోద్ కుమార్ చేసిన కృషిని వివరించారు. ఎంపీగా చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, మాజీ సర్పంచ్‌లు, నాయకులు తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, స్వామి, శేఖర్‌బాబు, దీటి రాజు తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ ప్రాసనతో రోగనిరోధక శక్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సువర్ణప్రాసన కేవలం ఔషధం మాత్రమే కాదని, సంస్కారం నేర్పుతుందని శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయుడు మోతుకు నరేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో విద్యార్థులకు సువర్ణప్రాసన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువర్ణప్రాసనతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, తెలివి, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సువర్ణ ప్రాసన ప్రముఖ్ గంధసిరి కృష్ణమూర్తి, పెద్ది వైకుంఠం, కొమురవెల్లి శేఖరం, అలయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఆచార్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

సిద్దిపేటజోన్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం హరిప్రియనగర్ కాలనీలో అధికారులు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వంటగదిలో అజాగ్రత్తగా ఉండరాదని, తగిన వెలుతురు, గాలి వచ్చేలా ఉండాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ లీకేజ్ ప్రమాదం జరిగిన వెంటనే తీసుకునే జాగ్రత్తలు వివరించారు. అగ్ని ప్రమాదం జరిగితే 101, 87126 99250, 87126 99251 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో మంచి హోదా కోసం ఉన్నత విద్య ద్వారా మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం జిజ్ఞాస కార్యక్రమంలో గణితంలో రాష్ట్ర స్థాయి ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులను అభినందించారు.

మాస్టర్ ట్రైనర్లను తొలగించాలి

జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, నాగరాజు

సిద్దిపేటరూరల్: సిద్దిపేట నియోజకవర్గంలోని ఎన్నికల మాస్టర్ ట్రైనర్లను విధుల నుంచి తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు కలెక్టరేట్‌లో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు తనకు నమ్మిన బంటుగా ఉన్న వారిని, అప్పటి కలెక్టర్, ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని నియమించారన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రస్తుత మాస్టర్ ట్రైనర్లను విధుల నుంచి తొలగించాలన్నారు.


గ్రామస్తుడు మృత్యువాతపడిన మాలవాడలోని పాడుబడ్డ బావి ఇదే


బెస్తవాడలో ప్రమాదకరంగా ఉన్న పాడుబడ్డ బావి

మృత్యుకుహరాలు

ఇళ్ల మధ్య పాడుబడ్డ బావులు
- దట్టంగా మొక్కలు పెరిగి లోతు తెలియని దుస్థితి
- ప్రమాదకరంగా మారాయని స్థానికుల ఆందోళన
- పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

జనావాసాల్లో పాడుబడ్డ బావులు మృత్యు కుహరాలుగా మారాయి. ఏమరుపాటుగా ఉంటే ప్రాణాలు పోవడం ఖాయం. అంతేకాకుండా దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలకు, రోగ కారక సూక్ష్మజీవులకు ఆవాసమయ్యాయి. రోగాలు వ్యాపించే కేంద్రాలుగా మారాయని, గ్రామ నడిబొడ్డున ప్రమాదకరంగా మారిన పురాతన బావుల పూడ్చివేతలో అధికార యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మజీద్‌పల్లి మాలవాడ, బెస్తవాడలో పురాతన బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. దాదాపు అర ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ బావుల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో లోతు తెలియదు. అందులో నీటి నిల్వలు దోమల వృద్ధికి దోహదపడుతున్నాయి. పొరపాటున అందులో జారిపడితే ప్రాణాలు పోగొట్టుకోవడం ఖాయం. మజీదుపల్లిలో జనవరిలో సంక్రాంతి పండగ ముందురోజు రాత్రి గాలం జంపులు (55) తన ఇంటి పక్కనున్న బావివైపు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులోపడి మృతి చెందాడు. పురాతన బావుల పూడ్చివేతకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం


గ్రామాల్లో ఇళ్ల మధ్య పురాతన బావులు చాలా ఇబ్బందిగా మారాయి. చెత్తాచెదారంతోపాటు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి నిరుపయోగంగా మారాయి. నీళ్లు ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రి వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. రోగాలబారిన పడుతున్నాం. – గాలం స్వరూప, మజీదుపల్లి

దోమల బెడద ఎక్కువ


పాడుబడ్డ బావులతో చాలా ఇబ్బందిపడుతున్నాం. ఇళ్ల మధ్య ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో నిద్ర కరువైంది. సంక్రాంతి నాడు బావిలో పడి ఓ వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. బావులు పూడిస్తే రోగాలు రావు. ప్రాణాలకు ముప్పు తప్పుతుంది. – శివవ్వ, మజీదుపల్లి

పార్టీని చీల్చడానికే బీఆర్‌ఎస్‌లోకి..


దుబ్బాకలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక: పార్టీని చీల్చడానికే కత్తి కార్తీక బీఆర్‌ఎస్‌లో చేరిందని, ఇది గమనించకుండా ఆ పార్టీ నాయకులు ఆమెకు వత్తాసు పలుకుతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మంగళవారం దుబ్బాకలోని కాంగ్రెస్ కార్యాలయంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, కొంగరి రవి, శ్రీకాంత్, రాంచంద్రారెడ్డి మాట్లాడారు. కత్తి కార్తీకది ఏ ఊరు ఏ నియోజకవర్గమో బీఆర్‌ఎస్ నాయకులు చెప్పాలన్నారు. కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మిది దుబ్బాక నియోజకవర్గంలోని ఘనపురం గ్రామమని, ఇది తెలుసుకోకుండా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఉనికి కోల్పోతుండటంతో తట్టుకోలేకనే కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు విమర్శిస్తే సహించబోమన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి


హుస్నాబాద్‌లో రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో పాల్గొన్న జేఏసీ నాయకులు

హుస్నాబాద్: ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు పోరాటం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని నియోజకవర్గ జేఏసీ నాయకులు అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. మల్లె చెట్టు చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పదేళ్లుగా మోదీ నిరంకుశ విధానాలను అవలంబిస్తున్నారన్నారు. రైతులు, కూలీలు, నిరుద్యోగ తదితర సమస్యలను పరిష్కరించకుండా ఓటర్ల దృష్టిని మరల్చడానికే దేవుడిని ముందుకు తెచ్చారన్నారు. విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా ప్రజాప్రతినిధులను మేల్కొల్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్ మేకల వీరన్న, ప్రొఫెసర్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే ప్రమాదాలను అరికట్టాలి


అగ్ని ప్రమాదం సంభవిస్తే రక్షించుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్: అగ్ని ప్రమాదాలను ప్రాథమిక దశలో ఉన్నప్పుడే అరికడితే ఆస్తి, ప్రాణ నష్టాన్ని వీలైనంత తగ్గించవచ్చని దుబ్బాక అగ్నిమాపక కేంద్ర అధికారి స్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం దుబ్బాక పట్టణ ప్రజలకు అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజ్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగితే ప్రాథమికంగా చేయాల్సిన అంశాలను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలు, భారీ భవనాలు, గోదాముల్లో యజమానులు అగ్నిమాపక యంత్రాలను తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ రాజేష్ కుమార్, సిబ్బంది మురళీకృష్ణ, నరేందర్, నవీన్, వినోద్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార రథం అడ్డగింత

చెప్పుల దండ వేసి నిరసన

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, జిల్లా మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచార రథాన్ని సొంత పార్టీ బూత్ కమిటీ అధ్యక్షుడే అడ్డుకున్నాడు. రథానికి చెప్పుల దండవేసి నిరసన తెలిపారు. ఈఘటన మంగళవారం జరిగింది. వెంకట్రామిరెడ్డి ప్రచార రథం మండల పరిధిలోని కాసులాబాద్‌కు చేరింది. అదే గ్రామానికి చెందిన సొంత పార్టీ బూత్ కమిటీ అధ్యక్షుడు రంగనబోయిన యాదగిరి, ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచార రథాన్ని అడ్డుకుకొని చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదన్నారు. మోతె శివారులోని 590 సర్వే నంబర్‌లో ఎకరం 18 గుంటల భూమి విషయంలో తమకు, మోతె గ్రామానికి చెందిన సోలిపేట జీవన్‌రెడ్డికి మధ్య భూ తగాదా నడుస్తుందన్నారు. తమ వద్ద 13బీ, ఆర్‌ఓఆర్, ప్రొసీడింగ్, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ, వెంకట్రామిరెడ్డి తయకు న్యాయం చేయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. వెంకట్రామిరెడ్డి తమ సమీప బంధువు సోలిపేట జీవన్‌రెడ్డి పేరిట పట్టా చేయించారని ఆరోపించారు.

కేసు నమోదు

బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి ఎన్నికల ప్రచార రథానికి చెప్పుల దండ వేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్శరామ్ మంగళవారం తెలిపారు.


కాసులాబాద్‌లో నిరసన తెలుపుతున్న యాదగిరి, కుటుంబ సభ్యులు

సీఎం ప్రకటన హర్షణీయం

వర్గల్(గజ్వేల్): మంత్రి వర్గంలో ముదిరాజులకు అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం హర్షణీయమని, ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపే ధ్యేయంగా ముదిరాజ్‌లు ముందుకు సాగాలని ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి భిక్షపతి ముదిరాజ్, వర్గల్ మండల అధ్యక్షుడు శ్రీరాం నర్సింలు ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం వర్గల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్‌ల సమస్యలపై సీఎం రేవంత్ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి చేర్చే విషయంలో కాంగ్రెస్ పాలకులు కట్టుబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ముదిరాజులపై ఉందన్నారు. సమావేశంలో ముదిరాజ్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి


పాలమాకులలో వడ్ల తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నంగునూరు(సిద్దిపేట): వడ్లను ఆరబెట్టి తేవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో కొనుగోలు చేసిన వడ్లు, నిల్వల వివరాలు, తేమ శాతాన్ని పరిశీలించి రైతులు, నిర్వాహకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీఏ పద్మ, ఏఓ గీత, ఏఈఓ అశోక్, ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కోహెడరూరల్(హుస్నాబాద్): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం మండలంలోని నాగసముద్రాల గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం తిరుపతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి సింధూజ అన్నారు. మండలంలోని గండిపల్లి ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. పంటకు గిట్టుబాటు ధర రావాలంటే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): ధాన్యాన్ని దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని ఏఈవో రాకేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పాటు నర్సాయపల్లి, గాగ్గిళ్లాపూర్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

హుస్నాబాద్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోతారం(ఎస్), బంజేపల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలతో పాటు మహ్మదాపూర్, నాగారం, పందిల్ల, పొట్లపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

బాలల కథల పోటీల్లో విద్యార్థి ప్రతిభ

తొగుట(దుబ్బాక): సిద్దిపేట సుగుణ సాహితీ సమితి సంస్థ నిర్వహించిన బాలల కథల పోటీల్లో మండలంలోని చందాపూర్ విద్యార్థి అభిలాష్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఉగాది పండగ సందర్భంగా బాలల కథల పోటీలు నిర్వహించగా 270 కథలు వచ్చాయి. అందులో అభిలాష్ రాసిన కథ ఎంపికయ్యింది. దీంతో విజేతలకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. అభిలాష్‌కు ప్రశంసా పత్రంతోపాటు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సాహితి సంస్థ కన్వీనర్ బైతి దుర్గం, తొగుట ఎంఈఓ సత్తు యాదవరెడ్డి, హెచ్‌ఎం సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగవద్దు

సిద్దిపేటకమాన్: పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ మాదిగలను ఓటు అడగవద్దని ఎమ్మార్పీఎస్ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీ స్థానాల్లో, కంటోన్మెంట్ అసెంబ్లీ (ఎస్సీ) స్థానంలో ఒక్క టికెట్ కూడా మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు


మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీపీఓ దేవకీదేవి ఆదేశించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులుతో తాగునీరు, ఈజీఎస్ సమస్యలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. లైసెన్స్‌లు లేని దుకాణాలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సమీక్షలో డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య, హుస్నాబాద్, సిద్దిపేట డీఎల్‌పీఓలు వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఏపీఎం నర్సయ్య, ఎంపీఓ విష్ణు, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలను కాపాడొచ్చు


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడొచ్చని గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ నారాయణగూడ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు.

కార్యవర్గం నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని మంగళవారం నియమించినట్లు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా పురుమాండ్ల నరసింహారెడ్డి, పరకాల తిరుపతిరెడ్డి, గౌరారం కృష్ణ, దేవుని నరసింహారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, ముత్తినేని రాజు, కార్యదర్శులుగా మర్కంటి ఏగొండ, మేకల రజనీకాంత్, ఇరుపాక లింగారెడ్డి, ఆవుల అజిత్ యాదవ్, మొగుల్ల స్వామి, కంకణాల నర్సింహులు, అధికార ప్రతినిధులుగా పాలకొల్లు వెంకటరామిరెడ్డి, కృష్ణం గారి రమేష్ రెడ్డి, శిమ్ముల సాంబశివారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా లంబ నాగరాజు నియమితులయ్యారు.

సంక్షిప్త వార్తలు

◆ **వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి**

మద్దూరు(హుస్నాబాద్): ఎండలకు వడదెబ్బతగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుధీర్ అన్నారు. మంగళవారం మండలంలోని రేబర్తిలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఇంటివద్దే ఉండాలన్నారు. నీరు సరిపడా తాగాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యులను సంప్రందించాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి ప్రతిభ, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో గ్రామానికి చెందిన బొబ్బల బుచ్చిరెడ్డి జ్ఞాపకార్థం, సిద్దిపేట లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాగర్, శిరీష, మణి ప్రసన్న, శ్రావ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధి లగిశెట్టి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ **బెదిరింపులకు భయపడం**

వర్గల్(గజ్వేల్): బీజేపీ నేతృత్వంలోని కేంద్రం బెదిరింపులకు భయపడబోమని, కేసీఆర్ కుటుంబంపై కక్షపూరితంగా నమోదు చేసిన కేసులకు తగిన విధంగా బుద్ధి చెబుతామని బీఆర్‌ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. మంగళవారం వర్గల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమలుకు సాధ్యంకాని హామీలు గుప్పించి అధికారం చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి వంద రోజులు దాటుతున్నా వాటిని అమలు చేయక పోవడం సిగ్గుచేటన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే పంట రుణమాఫీ ప్రకటన చేశారన్నారు.

◆ **ఉపాధి పనుల పరిశీలన**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో 2018–22 మధ్యలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను మంగళవారం అకౌంట్ జనరల్ ఆడిట్ బృందం పరిశీలించింది. మామిడి తోటలు, ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులతో పాటు ఎంపిక చేసిన 16 రకాల పనులు, ఉపాధి హామీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, సీనియర్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, అడిషనల్ ఆడిట్ ఆఫీసర్లు కల్యాణ్, శేషగిరి, కొండయ్య, డివిజన్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **భక్తిగేయాల ఆడియో సీడీలు ఆవిష్కరణ**

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యా సరస్వతీ క్షేత్రంలో మంగళవారం రాత్రి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరశర్మ సిద్ధాంతి భక్తిగేయాల ఆడియో సీడీలను ఆవిష్కరించారు. ఆడియో సీడీలలో శ్రీవిద్యా సరస్వతీ అమ్మవారి మేలుకొలుపు, నీరాజనం, మహాశివుని భక్తిపాటలకు విశ్వేశ్వర్‌రావు స్వరకల్పన చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ నిత్యపూజలు అందుకుంటున్న వాగ్దేవికి, కవులు, కళాకారులు సంగీత సాహిత్య నీరాజనాలు అర్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాచేపల్లి వెంకటకృష్ణారావు, బొమ్మిడాల సత్యనారాయణ, గుండేశ్వరశర్మ, బండారు రాం ఫణిదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

◆ **ముందస్తు పాఠాలు వద్దంటూ ఏబీవీపీ నిరసన**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి పాఠ్యాంశాలు బోధించొద్దంటు ఏబీవీపీ నాయకులు జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. మంగళవారం 9వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు, పదో తరగతి పాఠ్యాంశాలు బోధిస్తున్నారనే విషయం తెలుసుకున్న నాయకులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల కిటికీ అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 9వ తరగతి పరీక్షలు పూర్తికాకముందే పదో తరగతి పాఠ్యాంశాలు బోధిస్తూ ప్రభుత్వ విద్యావిధానానికి వ్యతిరేకంగా పాఠశాల నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జయ 2వ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి విద్యార్థి సంఘం నాయకులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

◆ **చిత్ర కళా ప్రదర్శన**

దుబ్బాకరూరల్: ప్రపంచ కళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రామక్కపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు నరసింహాచారి ప్రారంభించారు. డ్రాయింగ్ టీచర్ కాముని మల్లికార్జున్ ప్రోత్సాహంతో విద్యార్థులు వేసిన 60 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. మహనీయుల చిత్రాలు, ప్రకృతి, మహిళా శక్తి, భగవంతుని చిత్రాలు, పర్యావరణ పరిరక్షణ, మద్యపానం నిషేధం వంటి సందేశాత్మక చిత్రాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, వనజ, శైలజ, వెంకటరమణ, ధర్మగౌడ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.